క్లుప్తంగా

జేసీ తేజ్ భరత్‌కు వినతి

కంబాలచెరువు: కొద్ది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం జేసీ భరత్ తేజ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. వారిని రెగ్యులరైజ్ చేసి, హెచ్‌ఆర్ పాలసీ తదితర వాటిని అమలు చేయాలన్నారు. అనకాపల్లి మండల విద్యాశాఖ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్, ఉద్యమ నేత జడ్డు వాసుదేవరావు అకాల మృతికి రెండు నిమిషాల మౌనం పాటించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

నర్సరీ రైతుల వినతులు



డీఈ శ్రీధర్‌వర్మకు వినతిపత్రం అందజేస్తున్న పోలరాజు తదితరులు

కడియం: వ్యవసాయ ఫేజ్ 3 విద్యుత్ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్ వర్మకు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో పాలకవర్గం, నర్సరీ రైతులు మంగళవారం వినతిపత్రం అందించారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తూ గతంలో జీవో ఇచ్చారని, ఇప్పుడు మీటర్లు వేయడం తగదన్నారు. అలాగే జిల్లా ఉద్యానశాఖాధికారి బి.సుజాతను కలిసి ఆర్‌కేవీవై స్కీమ్‌లో 2021–22 సంవత్సరానికి మంజూరైన పాలీ హౌస్‌ల పెండింగ్ బిల్లులను రైతులకు వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

బ్రాహ్మణులకు వ్యాపార రుణాలు



అమ్మ ప్రసాద్‌ను సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘ నాయకులు

సీటీఆర్ఐ: బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ద్వారా బ్రాహ్మణులకు వ్యాపార రుణాలను అందజేస్తామని సొసైటీ చైర్మన్ అమ్మ ప్రసాద్ తెలిపారు. నూతనంగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణ మిత్ర సేవ సంఘం ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం స్థానిక చందా సత్రంలో అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారాలు చేసుకోవాలనుకునే బ్రాహ్మణులకు సొసైటీ రుణ సదుపాయాలు కల్పిస్తుందన్నారు. జిల్లాలోని 19 మండలాల బ్రాహ్మణ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. సూరంపూడి కామేష్, కలగ సుబ్రహ్మణ్యం, జయకృష్ణ, లక్ష్మీప్రసన్న, కస్తూరి సూర్యకుమారి పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు



డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న విష్ణుమూర్తి

ధవళేశ్వరం: అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దేనని మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. ధవళేశ్వరం సచివాలయం – 5లో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును సచివాలయ కన్వీనర్లతో కలిసి తాటికొండ విష్ణుమూర్తి ఆవిష్కరించారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు బొడ్డేటి శివాజీ, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షట్టర్ బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు బోడపాటి కుమార్, పెన్నాడ లక్ష్మి, పట్టపగలు వెంకటలక్ష్మి, పెరుమల్ల లక్ష్మీ సుజాత, అమ్ములు, కల్యాణి రెడ్డి, గొన్నా సత్తిబాబు పాల్గొన్నారు.

అధిక సొమ్ములు ఆశ చూపి..

కంబాలచెరువు: అధిక సొమ్ములు ఆశ చూపి ఆన్‌లైన్‌లో రూ.3.26 లక్షలకు టోకరా వేసిన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. లలితానగర్‌కు చెందిన డి.సత్యదుర్గశ్రీకి గత నెల 16న టెలిగ్రామ్‌లో లింక్ వచ్చింది. రూ.300కు రూ.600 చెల్లిస్తామని అందులో ఉండడంతో ఆమె ఆ దిశగా యాప్‌లో డబ్బులు పెడుతూ వచ్చింది. ఈ విధంగా దఫదఫాలుగా రూ.3.26 లక్షలు చెల్లించింది. తర్వాత ఆ యాప్ నుంచి లావాదేవీలు ఆగిపోయాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వ్యక్తి అదృశ్యం

కంబాలచెరువు: దానవాయిపేటలో నివాసముంటున్న లక్ష్మం నాయుడు అదృశ్యమైన సంఘటనపై ప్రకాశం నగర్‌లో మంగళవారం కేసు నమోదైంది. శ్రీకాకుళానికి చెందిన లక్ష్మం నాయుడు జగ్గంపేట సమీపంలోని రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాడు. అతడు ఈనెల 8 తేదీన ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. దీంతో అతని చిన్నాన్న ఉమా మహేశ్వరరావు ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చెట్లకు ఊపిరులూదుతూ..

- మహావృక్షాల రక్షణకు శ్రీకారం
- రోటరీ క్లబ్ ఐకాన్స్ ఆధ్వర్యాన వినూత్న కార్యక్రమం



కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పాతిన మహావృక్షం వద్ద కలెక్టర్ మాధవీలత తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: అవసరమైనంత ప్రాణవాయువును అందిస్తూ మనిషి ప్రాణాలకు ఊపిరులూదేవి పచ్చని చెట్లు. అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో అటువంటి చెట్లకూ ప్రాణగండం పొంచి ఉంటోంది. ఆపదలో చిక్కుకుంటున్న అలాంటి మహావృక్షాలకు ఊపిరులూదుతోంది రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్. ‘మహావృక్షో రక్షతి రక్షితః’ అంటూ.. పచ్చని చెట్ల పరిరక్షణకు పూనుకుంటోంది.

రోటరీ క్లబ్ సారథ్యంలో..

సాధారణంగా మహా వృక్షాలను కాపాడటం అభివృద్ధి చెందిన దేశాల్లో మాత్రమే జరుగుతున్నట్టు అందరం చూస్తూంటాం.. చదువుతూంటాం. ఇటువంటి వినూత్న ప్రక్రియను అందిపుచ్చుకుంటూ మహావృక్షాలను కాపాడే బాధ్యతను రోటరీ క్లబ్ తన భుజాన వేసుకుంది. మొక్కలు నాటి, వాటిని శ్రద్ధతో పెంచే ప్రయత్నం ఎంత ముఖ్యమో.. దశాబ్దాల వయసున్న మహా వృక్షాలను రక్షించి మరో ప్రాంతంలో ప్రాణ ప్రతిష్ఠ చేస్తే మానవాళి రక్షణకు టన్నుల కొద్దీ ప్రాణవాయివు అందించే అవకాశం ఏర్పడుతుందనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి పూనుకున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ అధ్యక్షుడు తీగల రాజా తెలిపారు. పెరుగుతున్న వాతావరణ కాలుష్యం నుంచి ప్రజలకు రక్షణ కల్పించే లక్ష్యంతో సామాజిక సేవా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రకటించారు. రోడ్ల విస్తరణలో భాగంగా సుమారు 60 నుంచి 70 ఏళ్ల వయసున్న మహావృక్షాలను నరికి వేయకుండా కాపాడుకునే ప్రయత్నం ప్రారంభించామని రోటరీ క్లబ్ ప్రకటించింది.

60 రోజుల ముందుగా పనులకు శ్రీకారం

రోడ్ల విస్తరణలో తొలగించాల్సిన మహా వృక్షాన్ని కాపాడాలంటే 60 రోజులు ముందుగానే ప్రాణ ప్రతిష్ఠ చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. గుర్తించిన చెట్టు వేర్లను నాలుగు దశల్లో పాతవి తొలగించి కెమికల్ ట్రీట్‌మెంట్ నిర్వహిస్తారు. పాత వేర్ల స్థానంలో కొత్త వేర్లు సృష్టించే కార్యక్రమం పూర్తి చేస్తారు. ఈ విధానం దాదాపు 60 రోజుల పాటు నిర్వహిస్తారు. అనంతరం ఆ వృక్షాన్ని భారీ క్రేనులు, జేసీబీ, భారీ ట్రాలీ సహాయంతో మరో ప్రాంతంలో నాటేందుకు తరలిస్తారు. ఇలా నాటిన వృక్షాన్ని మరో 60 రోజుల పాటు సంప్రదాయ ఎరువులతో పోషిస్తారు. జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు వ్యవసాయ భూములలో సుమారు 200 వృక్షాలను ఒక చోట నుంచి మరొక చోటుకు తరలించి సఫలీకృతమైన విషయాన్ని గుర్తించి మహా వృక్షాలను కపాడుకునే ఆలోచన చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు తీగెల రాజా తెలిపారు.



రాజానగరం ఏడీబీ రోడ్డులో గుర్తించిన మహా వృక్షం



భారీ వృక్షానికి కెమికల్ ట్రీట్‌మెంట్ నిర్వహిస్తున్న సిబ్బంది



రాజానగరం మండలం సీతారాంపురంలో తరలించేందుకు గుర్తించిన 70 ఏళ్ల రావిచెట్టు

- మొట్ట మొదటగా రాజానగరం ఏడీబీ రోడ్డులోని సాక్షి పత్రిక ప్రధాన కార్యాలయం ఎదురుగా గల రోడ్డు విస్తరణలో భాగంగా సుమారు 60 ఏళ్ల మర్రిచెట్టుకు శాస్త్రీయ పద్ధతిలో 60 రోజుల పాటు కెమికల్ ట్రీట్‌మెంట్ చేశారు. అనంతరం భారీ క్రేన్, ట్రాలీల ద్వారా రాజమహేంద్రవరం వై.జంక్షన్‌లోని కలెక్టర్ క్యాంపు ఆఫీస్ పక్కన నిర్మిస్తున్న కలెక్టర్ సమావేశ మందిరం ప్రాంగణంలో నాటారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కె.మాధవీలత, నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ పాల్గొన్నారు.
- మరో మహా వృక్షాన్ని కాతేరు రోడ్డులోని తిరుమల స్కూల్ వద్ద రోడ్డు రివైండింగ్‌లో తొలగించేందుకు గుర్తించారు. 40 ఏళ్ల వయసున్న జమ్మి, రవి కలిసి ఒకే కాండంగా తయారైన మహా వృక్షాన్ని మరో ప్రాంతంలో నాటేందుకు కెమికల్ ట్రీట్‌మెంట్ ప్రారంభించారు. 30 రోజుల తరువాత ఈ వృక్షాన్ని వెంకట నగరం గోదావరి తీరంలో భక్తులు దర్శించుకునే విధంగా నాటేందుకు సన్నాహాలు ప్రారంభించారు.
- రాజానగరం మండలం సీతారాంపురం గ్రామంలో సుమారు 70 ఏళ్ల వయసున్న రావిచెట్టును రోడ్డు విస్తరణలో తొలగించాలని నిర్ణయించారు. దాన్ని మరో ప్రాంతానికి తరలించేలా కెమికల్ ట్రీట్‌మెంట్ ప్రారంభించారు. అదే గ్రామంలోని 70 ఏళ్ల మర్రిచెట్టును సైతం అధికారులు తొలగించేందుకు గుర్తించారు.

వృక్షాన్ని తరలించాలంటే భారీ ఖర్చు



సాధారణ వృక్షాన్ని తరలించడానికి రూ.లక్ష, ఆ తర్వాత సైజును బట్టి ఖర్చు పెరుగుతుంది. రోటరీ క్లబ్ గుర్తించిన మహా వృక్షాన్ని డోనర్ సహాయంతో తరలించే చర్యలు చేపడతాం. వృక్షం నాటిన తర్వాత అక్కడ సంస్థ, డోనర్ పేర్లతో శిలాఫలకం ఏర్పాటు చేస్తాం. ఇప్పటి వరకూ పది మహా వృక్షాలను సురక్షిత ప్రాంతాలను తరలించే లక్ష్యంతో పది మంది డోనర్లను సిద్ధం చేశాం. మొక్కలు నాటి ఏళ్ల తరబడి పెంచే కన్నా, ఏళ్లు తరబడి పెరిగిన మహావృక్షాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

– తీగల రాజా, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ అధ్యక్షుడు

చెట్లను కాపాడటం అందరి బాధ్యత



చిన్న మొక్కలు నాటి వాటిని పెంచే ప్రయత్నం కన్నా, ఏళ్ల తరబడి పెరిగిన మహా వృక్షాలను కాపాడుకునే ప్రయత్నం చేయాలి. చెట్లపై అమితమైన ప్రేమతో మహా వృక్షాలను కాపాడాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. చెట్లపై ఉన్న మమకారంలో మూడు నెలలు ప్రత్యేక శిక్షణ పొంది వృక్షాలను కాపాడేందుకు చర్యలు చేపట్టాం. రోటరీ క్లబ్ సహకారంతో మరిన్ని మహావృక్షాలను కాపాడేందుకు నిరంతర కృషి చేస్తాం.

– రేకపల్లి దుర్గాప్రసాద్, ప్రాజెక్ట్ చైర్మన్

అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం జగన్ పాలన



మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- బంధు వందనం కార్యక్రమంలో మంత్రి వేణు

ధవళేశ్వరం: భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ధవళేశ్వరంలోని జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కల్యాణ మండపంలో మంగళవారం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ షెడ్యూల్డ్ కులాల ఆత్మీయ కలయిక బంధు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వేణు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాధికారం అందించిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. ఆయన ఒక శక్తి, స్ఫూర్తి, బలం, సైన్యం అని కొనియాడారు. అంబేడ్కర్ స్ఫూర్తితోనే సీఎం జగన్ రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు మంజూరు చేస్తున్నారన్నారు. దళితుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీల సాధికారత కోసమే తనను రూరల్ కో ఆర్డినేటర్‌గా నియమించారని వేణు అన్నారు. 2009లో జక్కంపూడి మంత్రిగా చేసిన రాజమహేంద్రవరం రూరల్ నియోజవర్గంలో మీకు సేవలు అందించేందుకు తనను నియమించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దివంగత మాజీ మంత్రి బత్తిన సుబ్బారావు సేవలను కొనియాడారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ మాట్లాడుతూ బలహీన వర్గాలకు చెందిన సీనియర్ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మన నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించడం అందరూ గర్వించదగ్గ విషయం అన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బడుగు ప్రశాంత్ కుమార్ (చిన్ని) మాట్లాడుతూ రూరల్‌లోని దళిత నాయకులకు నామినేటెడ్ పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దళిత సంఘ నాయకులు బట్టు చిన్ని, యల్లె వీర్రాజు, మెల్లిమి గంగరాజు, పెయ్యల రాజేష్ , విప్పర్తి ఫణికుమార్, కాగిత విజయ్‌కుమార్, తలారి వరప్రసాద్, ఎన్వీ శేఖర్, గోలి దేవకుమార్, గునిపె అశోక్, మిరప రమేష్, ముత్యాల జాన్, దేవదాసి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిరెడ్డి వాసు ప్రచారం హాస్యాస్పదం



విలేకరులతో మాట్లాడుతున్న నక్కా శ్రీనగేష్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఇతర పార్టీలు చేసిన అభివృద్ధిని టీడీపీ నాయకుడు అదిరెడ్డి వాసు తమ సొంత అభివృద్ధిగా ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా శ్రీనగేష్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో గౌతమ ఘాట్, కోటిలింగాల ఘాట్, బీసీ హాస్టళ్లు, విద్యానగర్‌లో స్కేటింగ్ రింగ్, మున్సిపల్ బ్యాడ్మింటన్ కోర్టులను తామే నిర్మించామని వాసు బ్రోచర్ ద్వారా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. గౌతమ ఘాట్, కోటిలింగాల ఘాట్లు గత పుష్కరాల్లో నిర్మించారని ఆ సమయంలో ఆదిరెడ్డి కుటుంబం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉందన్నారు. బీసీ హాస్టళ్ల నిర్మాణం ఉండవల్లి ఎంపీగా, రౌతు సూర్యప్రకాశరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రారంభమైందన్నారు. అచ్చెన్నాయుడు మంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆదిరెడ్డి కుటుంబం వైఎస్సార్ సీపీలోనే ఉందన్నారు. స్కేటింగ్ రింగ్ అనేది పరిమి వాసు కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ఒక క్రీడాకారుడిగా ప్రత్యేక దృష్టి పెట్టి నిర్మించారని, అలాగే బ్యాడ్మింటన్ కోర్టును కూడా అప్పటి కమిషనర్ విజయరామరాజు క్రీడాకారుడిగా ఒక ప్యాషన్‌తో నిర్మించారే తప్ప ఆదిరెడ్డి కుటుంబానికి ఏ సంబంధం లేదన్నారు. ఎంపీ భరత్ రామ్ నూతన ఉత్సాహం, నూతన ఒరవడితో నగరాన్ని అభివృద్ధి పరుస్తుంటే టీడీపీ నాయకులు విమర్శించడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉదయరాజా, రేగుళ్ల బాల శ్రీధర్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు

కంబాలచెరువు: స్థానిక ధర్మంచర కమ్యూనిటీ హాలులో మంగళవారం ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (కాత్వా) ఆధ్వర్యంలో సావిత్రీ బాయి పూలే జయంతి, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అద్దేపల్లి మహాలక్ష్మీదేవి కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పూడి హేమలత మాట్లాడుతూ సావిత్రీ బాయి చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మరో ముఖ్య అతిథి డాక్టర్ కందుల రేణుక మాట్లాడుతూ ఏపీ కాత్వా ద్వారా చేస్తున్న సేవలను అభినందించారు. అనంతరం 18 మంది మహిళా ఉపాధ్యాయులను సావిత్రీ బాయి పూలే ఉత్తమ మహిళా పురస్కారాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోపిశెట్టి బంగార్రాజు, ప్రధాన కార్యదర్శి మద్దాల అప్పారావు, గౌరవ అధ్యక్షుడు చేబ్రోలు వెంకటాచలం, ప్రధానోపాధ్యాయ సంఘం నాయకులు కోలా సత్యనారాయణ, కేవీ.రమణారావు, మంగిన రామారావు పాల్గొన్నారు.

ప్రజల కన్నీళ్లను తుడిచిన పాదయాత్ర

- నవరత్నాలతో అందరి సంక్షేమం
- ప్రజాసంకల్ప యాత్రకు ఐదేళ్లు
- ఎంపీ కార్యాలయంలో సంబరాలు



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్, అడపా శ్రీహరి, మార్గాని నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రజల కష్టాలు, ఆవేదనను దగ్గరగా చూసిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. డాక్టర్ గూడూరి, అడపా శ్రీహరి సంయుక్తంగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర మరచిపోలేనిదన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ స్వగ్రామం కడప జిల్లా ఇడుపులపాయ నుంచి జగన్‌మోహన్ రెడ్డి 2017 నవంబర్ 6న సంకల్ప పాదయాత్ర ప్రారంభించి 2019 జనవరి 9న ముగించారని తెలిపారు. ఈ సుదీర్ఘ పాదయాత్ర 341 రోజుల పాటు 3,684 కిలోమీటర్ల మేర కొనసాగిందన్నారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లు, సమస్యలు పరిష్కరించడంలో భాగంగా సీఎం జగన్ ప్రకటించిన ‘నవరత్నాలు’ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని తెలిపారు. పేదరికమే అర్హతగా సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి అందజేస్తున్నారన్నారు. జగన్ సీఎం అయిన తరువాత రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు, గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు.

సంక్రాంతి సంబరాలు

రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిటీ నియోజకవర్గం పరిధిలోని 42 డివిజన్లలో మంగళవారం నుంచి సంక్రాంతి సంబరాలు ప్రారంభించామని అడపా శ్రీహరి తెలిపారు. ప్రతిరోజు ఐదు డివిజన్లలో ముగ్గుల పోటీలు నిర్వహించి ఫ్రిజ్, టీవీ, వాషింగ్ మెషీన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా అందజేస్తామన్నారు. ఈ నెల 13న ఆర్ట్సు కళాశాల మైదానంలో మెగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్వీ శ్రీనివాస్, పోలు విజయలక్ష్మి, అను యాదవ్ పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి



రిలే దీక్ష చేస్తున్న రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానం అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ రాజమహేంద్రవరం డివిజనల్ ఓపెన్ లైన్ బ్రాంచ్ సెక్రటరీ చంద్రమౌళి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆ సంఘ నాయకులు రైల్వే స్టేషన్ ఆవరణలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. రైల్వే శాఖలో 2004 తరువాత నియామకం పొందిన వారికి నూతన పెన్షన్ విధానం గొడ్డలి పెట్టులాంటిదన్నారు. కార్యక్రమంలో వి.త్రినాథ్, నాగేంద్రరావు, జేడీ ప్రసాద్, అరవ నాగేంద్రకుమార్, రమేష్ పాల్గొన్నారు.

నిరంతర పోరాటం

కేంద్ర ప్రభుత్వ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పాత పెన్షన్ విధానం సాధన కోసం నిరంతర పోరాటం సాగిస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు కె.విజయ్‌కుమార్, డి.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ ఈనెల 11 వరకూ దేశ వ్యాప్తంగా జరిగే ఈ దీక్షల్లో ప్రతి ఉద్యోగీ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ వసంతరావు పాల్గొన్నారు.

భారీ బైక్ ర్యాలీ

కడియం: వైఎస్సార్ సీపీ దళిత నాయకుల ఆత్మీయ సమావేశానికి మండలం నుంచి భారీ ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. పార్టీ మండల కన్వీనర్, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జేగురుపాడు నుంచి కడియం మీదుగా ధవళేశ్వరంలోని జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి తరలివెళ్లారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీటీఆర్ఐ: 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు మంగళవారం జేసీ తేజ్‌భరత్‌కు ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందజేశారు. అనంతరం ఎన్వీ రమణ మాట్లాడుతూ ఈనెల 22 లోగా సమస్యలను పరిష్కరించని పరిస్థితిలో 23 నుంచి సమ్మె నిర్వహిస్తామని తెలిపారు.

పథకాలు పారదర్శకంగా అందించాలి

- సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలతో ఎంతో ప్రయోజనం
- మంత్రి వేణుగోపాలకృష్ణ



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న మంత్రి వేణు

ధవళేశ్వరం: ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేయడానికి ముఖ్యమంత్రి జగన్ సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో అమలు చేస్తున్న ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై మంగళవారం ధవళేశ్వరం జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కల్యాణ మండపంలో సచివాలయం సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ సచివాలయం వ్యవస్థ సీఎం మానస పుత్రిక అన్నారు. సచివాలయ సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అందించిన పథకాలను సకాలంలో లబ్ధిదారులకు చేరేలా పనిచేయాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేద విద్యార్థులందరూ ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టి బడుగు బలహీన వర్గాల వారి పిల్లలను విద్యావంతులను చేసి చూపించారన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరో రెండు అడుగులు ముందుకేసి నాడు నేడు ద్వారా పాఠశాలల ఆధునికీకరణ, అభివృద్ధి, మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ మండల ఎంపీడీవో డి శ్రీనివాసరావు, కడియం మండల ఎంపీడీవో కె.రత్నకుమారి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం



శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రజలకు మేలైన వైద్య సేవలు అందుతున్నాయని వక్తలు అన్నారు. కాతేరు గ్రామ సచివాలయం–1 పరిధిలో మంగళవారం నిర్వహించిన శిబిరంలో 421 మందికి వైద్యసేవలు అందించారు. ఇద్దరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి రిఫరల్ చేశారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, సచివాలయ కన్వీనర్లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సుజిత్, గైనకాలజిస్ట్ డాక్టర్ హెచ్.లక్ష్మీకృష్ణ బాయి, పీహెచ్‌సీ వైద్యులు ఈ.నాగదేవి, రౌతు జగదీష్ కృష్ణ వైద్య సేవలు అందించారు. పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు, సచివాలయ కన్వీనర్లు ఆచంట కళ్యాణ్, బళ్లా వీర వెంకట సత్యనారాయణ, బాగాల వెంకట రామారావు, గుత్తి వీర వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

409 మందికి వైద్య పరీక్షలు

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా మాధవరాయుడు పాలెం కొత్త కాలనీ కల్యాణ మండపంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 409 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు జరిపారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు శిబిరాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మందుల పంపిణీ ప్రారంభించారు. డాక్టర్ నాగసాయిమౌర్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 24 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే 32 మందికి కంటి వైద్య పరీక్షలు చేయగా, నలుగురిని ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశారు. డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న, కె.రామమోహన్, జీకేఎల్ పూర్ణిమ, గౌతమ్ వైద్య పరీక్షలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు సంగిత వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ గొల్లపల్లి గంగారత్నం, పంచాయతీ కార్యదర్శి శిరీష పాల్గొన్నారు.